రైతు సంక్షేమానికి ప్రభుత్వ కృషి

- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- గ్రామాల్లో ధాన్యం సేకరణను ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు


ఆర్మూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్/ బాల్కొండ/ వేల్పూర్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. అర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద, పెర్కిట్‌లో ఆర్మూర్ మహిళా పట్టణ సమాఖ్య మెప్మా మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం మద్దుతు ధర ఏ గ్రేడ్‌కు రూ.2320, బీ గ్రేడ్‌కు రూ. 2300, అలాగే బోనస్ రూ. 500 అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో టీఎంసీ ఉదయ్‌శ్రీ, సీవో రాజలింగం, కొనుగోలు కమిటీ సభ్యులు అనురాధ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మెండోరా మండలం వెల్కటూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి ప్రారంభించారు. రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు ప్రభుత్వం రూ. 500 బోనస్ ప్రకటించిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, మహిళా సమాఖ్య సభ్యులు, రైతులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలం కోమన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, ఐకేపీ ఏపీఎం మాణిక్యం, పడగల్ సొసైటీ వైస్‌చైర్మన్ నవీన్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్‌గౌడ్, నరేశ్, ప్రవీణ్, ఏఈవో ప్రశాంత్, నరేశ్, రాజేశ్వర్, సచిన్, వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


మెండోరా మండలం వెల్కటూర్‌లో ఏఎంసీ చైర్మన్


కోమన్‌పల్లిలో ఏఎంసీ వైస్ చైర్మన్

పోచారంపై అనుచిత వ్యాఖ్యలు తగవు


సమావేశంలో మాట్లాడుతున్న గంగారాం

రుద్రూర్: రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నరోజి గంగారాం, నాయకుడు తోట సంగయ్య అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై ఖండించారు. జీవన్‌రెడ్డిది ఐరన్ లెగ్ అని ఎద్దేవా చేశారు. సమావేశంలో పత్తి రాము, పట్టెపు రాములు, ఎస్ బాల్‌రాజ్, లక్ష్మణ్, దువ్వ రవి, అక్కపల్లి నాగేందర్, పత్తి సాయిలు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

బోధన్: సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అర్వింద్‌రెడ్డి గురువారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ఏఎస్‌వో రవి రాథోడ్, సొసైటీ సీఈవో బస్వంత్‌రావు పటేల్ ఉన్నారు.


వడ్లను పరిశీలిస్తున్న డీఎస్‌వో అర్వింద్‌రెడ్డి

సన్‌ఫ్లవర్‌ను కొనుగోలు చేయాలి

బోధన్ : సాలూర మండలంలోని హున్సా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సన్‌ఫ్లవర్‌ను కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు బోధన్ సబ్‌కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. సన్‌ఫ్లవర్ కొనుగోలు విషయమై సహకార సిబ్బందిని అడిగితే ప్రభుత్వం నుంచి తమకు అలాట్‌మెంట్ రాలేదని చెబుతున్నారని వివరించారు. గ్రామ రైతుల వద్ద 10 నుంచి 15 లారీల లోడ్ వరకు సన్‌ఫ్లవర్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. అకాల వర్షం కురిస్తే అపార నష్టం గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా


రుద్రూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న టీచర్


వేల్పూర్‌లో..

రుద్రూర్/ బోధన్‌టౌన్/ వేల్పూర్: కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాల్లోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్ గంగామణి మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని అధిగమించి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బోధన్ పట్టణంలోని ధ్యాకంగల్లీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లోకేశ్వరి, స్వరూప, పార్వతి ఇందిరా, రాణి, బాలింతలు పాల్గొన్నారు. వేల్పూర్ జీపీ కార్యాలయంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలామృతంలో ఉన్న పోషక విలువల గురించి సూపర్‌వైజర్ వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ నారాయణ, శ్రీనివాస్, ఆరోగ్యకార్యకర్తలు సమంత, రాధిక, అంగన్‌వాడీ టీచర్లు వసంత, వీణ, సరోజ, మీనాకుమారి, రూపలత, మంజుల, శ్రావణ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



నందిపేటలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న సిబ్బంది, ఆర్మూర్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారి

మోర్తాడ్/ బాల్కొండ/ నందిపేట్/ ఆర్మూర్‌టౌన్: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్ పట్టణాల్లో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పలు చోట్ల అవగాహన కార్యక్రమాలను గురువారం చేపట్టారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన అంశాలపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. భీమ్‌గల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బంది గంగస్వామి, భూమేశ్, వికాస్, మారుతి తదితరులు పాల్గొన్నారు. బాల్కొండలో అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. నందిపేటలో అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగరావు, సిబ్బంది నరేశ్, సురేశ్, శారజ్, సురేశ్ పాల్గొన్నారు. ఆర్మూర్‌లో అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది, పాల్గొన్నారు.

కలెక్టర్, ఆర్డీవోలకు సన్మానం



కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో గురువారం భూభారతి చట్టం అవగాహన సదస్సుకు హాజరైన కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, నర్సయ్య, సుంకెట బుచ్చన్న, మహ్మద్ అబ్దుల్ రఫీ, తిప్పిరెడ్డి శ్రీనివాస్, పడిగెల ప్రవీణ్, ఏనుగు మనోహర్, అజ్మత్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై రఘుపతి సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఆటో డ్రైవర్ల పక్కన ఉండే సీట్లను గురువారం తొలగించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకోవద్దని, ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



ఆర్మూర్: మామిడిపల్లిలోని నలంద ప్రీ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, హెచ్‌ఎం సాగర్ సర్టిఫికెట్లను ప్రధానం చేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుంధతి, నవనీత, జ్యోతి, సౌమ్య, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి ఇంటిపై దాడి

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఫైనాన్షియర్ క్రాంతికుమార్ ఇంటిపై ఎస్సై వినయ్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడి చేశారు. రూ. 29లక్షల79 వేల విలువ చేసే 103 ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. సీపీ చైతన్యకుమార్ ఆదేశాల మేరకు అధిక వడ్డీలు వసూలు చేస్తున్న క్రాంతికుమార్ ఇంటిపై దాడి చేశామని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణం 132/33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెర్కిట్, ఆర్మూర్, అంకాపూర్, ఇస్సాపల్లి, ఆలూర్, మామిడిపల్లి, ఫత్తేపూర్, గోవింద్‌పేట్, లక్కోర, చేపూర్, పిప్రి, మగ్గిడి, సూర్బిర్యాల్, కోమన్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు.

ఎమ్మెల్యే వినతితోనే నిధులు మంజూరు



ఆర్మూర్: పట్టణ శివారులో ని గూండ్ల చెరువు మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు రూ.4 కోట్లు మంజూరు కావడానికి ఆ ర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిన వినతి పత్రాలే కారణమని బీజేపీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా నిర్వహించిన సుందరీకరణ పనుల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరు కాలేకపోయినందున బీజేపీ నాయకులు గురువారం మినీ ట్యాంక్ బండ్‌ను సందర్శించారు. నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి, పాలెపు రాజు, సుంకరి రంగన్న, ఖాందేష్ ప్రశాంత్, కలిగోట ప్రశాంత్, ఉదయ్ గౌడ్, ప్రసన్న గౌడ్, అల్జాపూర్ రాజేశ్, రాము, నవీన్, కృష్ణ ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


రుద్రూర్‌లో గేదెకు టీకా వేస్తున్న వెటర్నరీ వైద్యుడు


బాల్కొండలో టీకాలు వేస్తున్న సిబ్బంది


దుర్గానగర్ తండాలో పశు వైద్య సిబ్బంది

రుద్రూర్/ బాల్కొండ/ మాక్లూర్: రుద్రూర్ మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి తెలిపారు. జీవాలకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం 48 గేదెలకు టీకాలు వేశామని, మరో మూడు రోజులు రుద్రూర్‌లో టీకాలు వేస్తామని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వచ్చే నెల 13వరకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బాల్కొండ మండల కేంద్రంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి గౌతమ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని దుర్గానగర్ తండాలో మండల పశువైద్యాధికారులు ఉమాసాహెర్, కిరణ్‌దేశ్ పాండే ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది 447 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగాపూర్‌లో రైతుల ఆందోళన

రుద్రూర్: కోటగిరి మండలం లింగాపూర్‌లో శివారులో ధాన్యం కొనుగోలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని రైతులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తపల్లి విండో పరిధిలోని సమీప గ్రామాల్లో దాదాపు ధాన్యం సేకరణ పూర్తయిందని, లింగాపూర్ శివారులో పది శాతం కూడా కొనుగోలు చేయలేదని వాపోయారు. గన్నీ బ్యాగులు, హమాలీ కొరత ఉందని కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధాన రహదారిపై ధాన్యం ఆరబోసి నెల రోజులవుతున్నా కాంటా చేయడం లేదని ఆరోపించారు. రైతుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ గంగాధర్ గ్రామానికి వచ్చి సమస్యను తెలుసుకున్నారు. హమాలీలను రప్పించి త్వరగా కొనుగోళ్లను ప్రారంభిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళనను విరమించారు.

లాఠీచార్జి చేయడం అమానుషం

బాల్కొండ/ కమ్మర్‌పల్లి/ వేల్పూర్: ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని నిలదీసిన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు అన్నారు. బాల్కొండ, కమ్మర్‌పల్లి, వేల్పూర్‌లో పార్టీ మండలాల అధ్యక్షులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, రేగుంట దేవేందర్, జైడి నాగధర్‌రెడ్డి వేర్వేరుగా గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఇస్తామన్న తులం బంగారం విషయమై అడిగిన బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు లాఠీ చార్జీ చేయడం దారుణమని అన్నారు. భీమ్‌గల్ పట్టణంలో బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును తులం బంగారం గురించి అడిగిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అడిగితే పోలీసులు అమానుషంగా ప్రవర్తించడంపై నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డివిజన్ ఏఎల్‌వోపై ఫిర్యాదు

బోధన్: డివిజన్ సహాయ కార్మిక సంక్షేమ శాఖ అధికారి నరేందర్ రాజుపై గురువారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారికి ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, బాధితుడు వీరేశం ఫిర్యాదు చేశారు.
కోటగిరి మండలంలోని రాణంపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల శాంత, భర్త వీరేశం దంపతులు 2016లోనే లేబర్ గుర్తింపు కార్డు పొందారని నాగరాజు తెలిపారు. దంపతులు తన కుమార్తె వివాహం జరిపించిన నేపథ్యంలో కార్మిక శాఖ ద్వారా రూ.30 వేల ఆర్థికసాయం పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. కానీ డివిజన్ ఏఎల్‌వో మంజూరు చేయించే విషయంలో ఉద్దేశ పూర్వకంగానే సాకులు చెప్పి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మెండోరా మండల ప్రత్యేకాధికారి ఆంజనేయస్వామి అన్నారు. గురువారం మెండోరా మండలం బుస్సాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటు పాఠశాలల కంటే మెరుగైన విద్య అందుతుందన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం రమేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కమ్మర్‌పల్లి : మండలంలోని హాసాకొత్తూర్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శివగంగమ్మ ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆలయంలో మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు హోమం, ధ్వజారోహనం, వలగొడుగు, 108 కలశాలతో ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు జుంబరాత్ శంకర్, యెల్ల నర్సయ్య, ఆల్గోట్ నారాయణ, రమేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వలగొడుగు ప్రదర్శిస్తున్న గంగపుత్రులు

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	వృషభ(తెలుగు)-10.30, ఎల్‌వైఎఫ్ (లవ్ యువర్ ఫాదర్)(తెలుగు)-1.40, 28సీ (తెలుగు)-7.55, కోర్ట్(తెలుగు)-4.45, 10.25
స్క్రీన్-2	సికిందర్(హిందీ)-10.00, 1.00, 7.10, 10.10, రాబిన్‌హుడ్(తెలుగు)-4.00
స్క్రీన్-3	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-11.20, 2.05, 4.50, 7.35, 10.20
స్క్రీన్-4	కోర్ట్(తెలుగు)-10.10, రాబిన్‌హుడ్(తెలుగు)-1.15, 10.20, శారీ(తెలుగు)-4.25, ఆదిత్య 369(తెలుగు)-7.15



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	95,200	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	88,060		

– నిజామాబాద్ బిజినెస్

క్లుప్తంగా

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

బోధన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. గురువారం పట్టణ శివారులో దివ్యాంగులతో కలిసి మాట్లాడారు. దివ్యాంగులకు నెలసరి పింఛన్ రూ. ఆరు వేలు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదన్నారు. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఈ నెల 19న హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశాన్ని దివ్యాంగులు విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ కార్యకర్తలకు పోస్టల్ ఇన్సూరెన్స్

రుద్రూర్: కోటగిరి, ఎత్తొండ గ్రామాలకు చెందిన బీజేపీ కార్యకర్తలకు పార్టీ బాన్సువాడ నియోజకవర్గ నాయకుడు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ పోస్టల్ ఇన్సూరెన్స్‌ను గురువారం చేయించారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏముల నవీన్, నాయకులు మామిడి శ్రీను, రాజాగౌడ్, రాజు, సాయిలు, గంగాధర్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఆర్మూర్‌టౌన్: సూర్యపేట జిల్లాలో న్యాయవాదిగా పనిచేస్తున్న మంతాపురం కిశోర్‌పై కక్షిదారులు దాడి చేసిన ఘటనను నిరసిస్తూ ఆర్మూర్ బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల శ్రీధర్, జెస్సు అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తక్షణమే తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు గటడి ఆనంద్, చైతన్య, కృష్ణ పండిత్, ఎంకే నరేందర్, సురేశ్, జగన్, ఖాందేష్ సంగీత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామంలో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రళయతేజ్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దినేశ్, రవి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

బోధన్‌రూరల్: మండలంలోని పెగడపల్లిలో పెంటాకలాన్ సొసైటీ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. గ్రామంలో గురువారం సొసైటీ చైర్మన్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా సహకార బ్యాంక్ బోధన్ మేనేజర్ లక్ష్మి రైతులకు బ్యాంకులో అందించే రుణాలు, సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్చాలి

బోధన్‌రూరల్: బడీడు పిల్లలను తల్లిదండ్రులు బడుల్లో చేర్చాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. బోధన్ మండలంలోని పెంటాకుర్దు ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రత్నాకర్, గంగాధర్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, శేఖర్ రెడ్డి, రజనీ, జోష్న, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కోనాపూర్ పాఠశాల తనిఖీ

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను నిజామాబాద్ డైట్ కళాశాల బృందం సభ్యులు నాగమణి గురువారం తనిఖీ చేశారు. స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అండ్ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాలలోని మౌలిక సౌకర్యాలు, యూ డైస్ వివరాలను తనిఖీ చేపట్టారు. హెచ్‌ఎం రామ్‌ప్రసాద్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు పదోన్నతి

మోర్తాడ్: భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్‌కు పదోన్నతి లభించింది. గ్రేడ్-3 కమిషనర్‌గా ఉన్న ఆయన గ్రేడ్-2 కమిషనర్‌గా పదోన్నతి పొందారు. బాసర్ మల్టీ జోన్ పరిధిలో 11 మంది కమిషనర్లకు పదోన్నతి లభించగా అందులో గోపు గంగాధర్ ఉన్నారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా ఆయనకు పదోన్నతి ఉత్తర్వులు అందాయి. కమిషనర్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంపై పోలీసులకు ఫిర్యాదు

కమ్మర్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి మండల నేతలు స్థానిక పీఎస్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా హామీని నెరవేర్చలేదన్నారు. నాయకులు రేగుంట దేవేందర్, స్వామి, మైలారం సుధాకర్, నరేందర్, ప్రకాశ్ నాయక్, కాలేరు శేఖర్, తీగల హరీశ్ తదితరులు ఉన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణకు అనుమతి ఇప్పించండి

మోర్తాడ్: ఏర్గట్లలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణకు అనుమతి ఇప్పించాలని ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును ఏర్గట్ల గ్రామస్తులు కోరారు. బుధవారం రాత్రి మోర్తాడ్‌లో మంత్రిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.